సాక్షి
ఒడిశా

శనివారం । 22 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,34,440
బంగారం	2 గ్రాముల 250 మిల్లీ గ్రాములు
వెండి	32 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



నేడు శ్రీజగన్నాథుని స్నానయాత్ర

పూరీ శ్రీజగన్నాథ స్వామివారి స్నానయాత్ర శనివారం జరగనుంది.

- 8లో



హాకీ ఇండియా స్పాన్సర్‌షిప్ పొడిగింపు

భారత హాకీ జట్టుకు స్పాన్సర్ చేస్తున్న ఒడిశా ప్రభుత్వం హాకీ ఇండియాతో స్పాన్సర్‌షిప్ ఒప్పందాన్ని 2036 వరకు పొడిగించింది.

- 8లో

ఆరోగ్య యోగం



భువనేశ్వర్: కళింగ స్టేడియంలో యోగ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) యోగాసనాలు వేస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి



కొరాపుట్: కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సామూహిక యోగ

మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగ దోహదం చేస్తుందని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నిచోట్ల యోగాసనాలు వేసి, వాటి ఉపయోగాలను తెలియజేశారు. పలుచోట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొరాపుట్: యోగ చేస్తున్న నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి



కొరాపుట్: సర్కిల్ జైలులో యెగ చేస్తున్న ఖైదీలు



భువనేశ్వర్: బిందు సాగర్‌లో జల యోగ విన్యాసాలు



భువనేశ్వర్: జల యోగ శిక్షణ కల్పిస్తున్న ట్రైనర్ అశోక్ కుమార్ బొరాల్



మల్కన్‌గిరి: ఇండోర్ స్టేడియంలో యోగలో పాల్గొన్న కలెక్టర్ పవార్ సచిన్ ప్రకాష్ తదితరులు



రాయగడ: మథర్ థెరిస్సా పాఠశాలలో యోగ చేస్తున్న విద్యార్థులు



రాయగడ: యోగ చేస్తున్న విద్యార్థినులు

యోగాతో మానసిక ప్రశాంతత

• సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సీఎం మోహన్ చరణ్ మాఝీ అన్నారు. స్థానిక కళింగ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం 10వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మానసిక ఉల్లాసం కోసం జీవితంలోని ప్రతి అంశంలో యోగాను చేర్చుకోవడంలో ప్రాధాన్యతను తెలియజేశారు. ప్రతిరోజూ యోగ చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో క్రీడలు మరియు యువజన వ్యవహారాల శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, అభివృద్ధి కమిషనర్ అనూగర్గ్, క్రీడా విభాగం కార్యదర్శి ఆర్.వినీల్ కృష్ణ, పలువురు సినీ నటులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: కాలేజీ వద్ద యోగ చేస్తున్న ప్రిన్సిపాల్ లింగరాజ్ తదితరులు



జయపురం: యోగ శిబిరంలో పాల్గొన్న ప్రజలు



జయపురం: యోగ చేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి తదితరులు



పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యామందిర్‌లో...



పర్లాకిమిడి: కోర్టు ప్రాంగణంలో యోగ చేస్తున్న జడ్జి, ఇతర న్యాయవాదులు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో యోగ చేస్తున్న మంత్రి నిత్యానంద గొండొ

న్యూస్‌రీల్

బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి ములిపుట్ ఆశ్రమ పాఠశాలకు మధ్యాహ్న భోజనం పథకానికి పంపిణీ చేసే బియ్యం లోడ్‌తో వెళ్తున్న ఒక లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలోని డ్రైవర్, హెల్పర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడినవారిని గుడారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలలకు బియ్యం తీసుకెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది.

నాటుసారా బట్టీలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

జయపురం: సమితి పరిధి బరిణిపుట్ పంచాయతీ ముండిగుడ అటవీ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 80 లీటర్ల నాటుసారాతో పాటు సారా తయారు చేసేందుకు సిద్ధం చేసిన 1,200ల లీటర్లకు పైగా ఇప్పటూట స్వాధీనం చేసుకొని పారవేసినట్లు ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర శుక్రవారం వెల్లడించారు. పారవేసిన నాటుసారా, ఊటల విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని అంచనా. ఈ క్రమంలో నాటుసారాను అమ్మకానికి తీసుకెళ్తున్న కుసుంపూర్ గ్రామానికి చెందిన టంకుధొర బిశాయి, డెప్పిగుడకు చెందిన ఒక మహిళని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పాముకాటుతో బాలుడికి అస్వస్థత

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని బిలామాల్ గ్రామానికి చెందిన రాహుల్ మాఝి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గురువారం సాయంత్రం ఇంటి వెనుక రాహుల్ ఆడుకుంటున్న సమయంలో ఒక పాము చెట్టు మీద నుంచి కిందికి పడి సరాసరి బాలుని తలపై కాటు వేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని వెంటనే కుటుంబీకులు టికిరిలోని ఉషాపాడు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అదేరోజు రాత్రి రాహుల్‌ను స్థానిక ఆస్పత్రికి రిఫర్ చేశారు. చికిత్సను అందించిన వైద్యులు ప్రస్తుతం బాలుడు ఆరోగ్యం మెరుగుపడిందని వెల్లడించారు.

భారీగా గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: జిల్లా పోలీసు యంత్రాంగం గంజాయి అక్రమ రవాణపై ఉక్కుపాదం మోపుతోంది. నిరంతర దాడులను నిర్వహిస్తూ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. ఈ క్రమంలో జిల్లాలోని పద్మపూర్, మునిగుడ పోలీసులు గురువారం వేరువేరుగా నిర్వహించిన దాడుల్లో 484.56 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఒకరిని అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం జిల్లాలోని పద్మపూర్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 365 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి పద్మపూర్ పోలీసుస్టేషన్ పరిధి హపిలుడ గ్రామానికి చెందిన సుకురు మాఝిగా గుర్తించారు. కారులో అక్రమంగా గంజాయి తరలిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు పట్టుకున్నారు. అదేవిధంగా మునిగుడ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 119.560 కిలోల గంజాయిని పట్టుకున్నారు. అయితే దాడులు నిర్వహించే సమయంలో నిందితుడు గంజాయిని వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



సచేతన రథం ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్ తదితరులు

• కొరాపుట్ కలెక్టర్ కీర్తి వాసన్

జయపురం: మైనర్ బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్ హెచ్చరించారు. కొరాపుట్ జిల్లా లేబర్ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా శ్రమ విభాగాలు సంయుక్తంగా గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల కార్మిక నివారణ సంచార సచేతన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ రథం జిల్లాలోని 14 సమితులు, 4 మున్సిపాలిటీ ప్రాంత పట్టణాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తుందని వెల్లడించారు. బాల కార్మిక వ్యవస్థకు విరుద్ధంగా అన్ని వర్గాల ప్రజలు సమైఖ్యంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఉందన్నారు. బాలక కార్మిక ముక్త రాష్ట్రంగా ఒడిశాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. 14 ఏళ్ల లోపు చిన్నారులను పరిశ్రమలు, ఇతరత్రా పనులకు నియమించకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను పనులకు నియమించిన వ్యక్తులకు రూ.50 వేల వరకు జరిమానాతో పాటు 3 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో లేబర్ కమిషనర్ నరేంద్ర రాయ్, జిల్లా సురక్షా అధికారి రాజేంద్ర దాస్, కొరాపుట్ లేబర్ ఆఫీసర్ బులుశ్రీ హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎంసీ సహాయ ఇంజినీర్ సస్పెండ్

భువనేశ్వర్: స్థానిక యూనిట్ 3 ప్రాంతం మసీదు కాలనీలో కాలువలో కొట్టుకుపోయి 8 ఏళ్ల మైనరు బాలుడు మృతి చెందిన ఘటనలో స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ మురికి కాలువల విభాగం సహాయ ఇంజినీర్‌ను సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఇంజినీర్ సంతోష్ కుమార్ దాస్‌ను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 18న స్థానిక లక్ష్మీసాగర్ ప్రాంతం యూనిట్ 3లో భారీ వర్షాల సమయంలో బహిరంగ కాలువలో కొట్టుకుపోయి 8 ఏళ్ల బాలుడు అబ్బూ బాబర్ మరణించాడు. వర్షపు నీటిపై తేలియాడుతున్న బెలూన్‌ను పట్టుకోవడానికి మైనర్ బాలుడు పరుగెత్తడంతో కొట్టుకుపోయాడు. గంటపాటు నిరవధికంగా చేపట్టిన గాలింపు మరియు సహాయక చర్యలు అనంతరం ఆస్కార్ సిటీ సమీపంలోని డ్రైన్‌లో బాలుడు తేలుతూ కనిపించాడు. అతడిని వెంటనే క్యాపిటల్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు.

దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు



దొంగతనం కేసులో అరెస్టైన నిందితుడు

జయపురం: స్థానిక బాబూ సునారి కాలనీలోని ఒక కంట్రాక్టర్ ఇంటిలో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు జయపురం పోలీసులు వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి స్థానిక డొంగాగుడకు చెందిన ఎం.హరీష్‌రావు అని వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాబూ సునారి కాలనీలో నివాసముంటున్న కంట్రాక్టర్ ఎస్.భాస్కరరావు ఈనెల 14వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఆ సమయంలో కర్ర పనులు చేసేందుకు హరీష్‌రావు భాస్కరరావు ఇంటికి వచ్చాడు. తలుపు బాగు చేసేందుకు భాస్కరరావు తనను పంపారని హరీష్ చెప్పాడు. గతంలో పలుమార్లు ఇంటిలో కర్ర పనులు చేయడం వలన అతడిని ఇంట్లోని భాస్కరరావు భార్య అనుమానించలేదు. తలుపు మరమ్మతులు చేసేందుకు అనుమతిచ్చింది. అనంతరం ఆమె తన పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో హరీష్ పని పూర్తి చేసుకొని బయటకు వెళ్లిపోయాడు. అతడు వెళ్లిపోయిన తర్వాత దొంగతనం జరిగిందని తెలుసుకున్న ఆ ఇంటి గృహిణి భర్తకు తెలియజేయగా, అతడు వచ్చి బీరువాలో రూ.7 వేలుతో పాటు రెండు బంగారు గొలుసులు మాయమైన విషయంపై పట్టణ పోలీసుస్టేషన్‌లో లిఖిత ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి గురువారం హరీష్‌రావుని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.40,660 నగదు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

జయపురం: ఒక పెళ్లి విందుకు వెళ్లి తిరిగి వస్తూ ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మృతి చెందినవారు స్థానిక మదలావీధికి చెందిన బినాయిక్ రథ్(30), బెహర వీధికి చెందిన దీపక్ పాయిక్(30)లుగా గుర్తించారు. వీరిద్దరూ కలిసి ఒక బైక్‌పై కోట్‌పాడ్‌లో వివాహ విందుకు వెళ్లారు. విందు అనంతరం రాత్రి తిరిగి జయపురం వస్తున్నారు. ఈ క్రమంలో బొరిగుమ్మ సమితి బిజాపూర్ గ్రామం వద్ద రోడ్డు తవ్విన మట్టి ఉండడంతో మట్టిపై బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ రోడ్డుపై పడ్డారు. ఇద్దరికీ తలలపై బలమైన గాయాలు కావడంతో స్థానికులు కోట్‌పాడ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిని పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందిన మృతుల కుటుంబాల సభ్యులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఘటనపై బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోడ్డు తవ్వి మట్టిని గుట్టగా వేయడం వలనే ఇద్దరూ దుర్మరణం చెందారని, అందుచేత ఆ కంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున ఆర్థిక సాయం చేస్తామని రోడ్డు కంట్రాక్టర్ వెల్లడించినట్లు తెలిసింది.

వారం రోజుల్లో బియ్యం ఏటీఎం

• మంత్రి కృష్ణచంద్ర పాత్రో

భువనేశ్వర్: ప్రజా పంపిణీ వ్యవస్థలో వస్తువుల పంపిణీని సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బియ్యం ఏటీఎంను తెరవాలని నిర్ణయించింది. తొలి దశలో నగరంలో ఈ వ్యవస్థని ప్రారంభించనున్నారు. వారం రోజుల్లో బియ్యం ఏటీఎం సౌకర్యం నగర వాసులకు అందుబాటులోకి రానుందని ఆహార సరఫరాలు మరియు వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో వివరించారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం జరిగిన శాఖాధికారుల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారం రోజుల్లో పీడీఎస్ కార్డుదారుల కోసం బియ్యం ఏటీఎంను భువనేశ్వర్‌లో ఏర్పాటు చేయనున్నారు. తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఈ సదుపాయాన్ని అంచెలంచెలుగా విస్తరిస్తారు. లబ్ధిదారులు తమ కార్డులను ఏటీఎం మెషీన్‌లో ఇన్సర్ట్ చేసి నెలవారీ కోటాను పొందవచ్చని మంత్రి తెలిపారు.

వరి కనీస మద్దతు ధర పెంపు

భారతీయ జనతా పార్టీ ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన హామీల వాస్తవ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీజన్ నుంచి క్వింటాల్‌కు రూ.3,100 చొప్పున వరికి మద్దతు ధరతో ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. వరి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కేంద్ర ప్రభుత్వం బుధవారం రూ.2,300గా సవరించింది. ఈ చర్యతో రాష్ట్ర ఖజానాపై భారం గణనీయంగా తగ్గిందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వరి క్వింటాల్ కనీస మద్దతు ధర పెంచడంతో రాష్ట్ర ఖజానాపై ప్రతి క్వింటాలు వరి కొనుగోలుకు రూ.917 అదనపు భారం పడింది. కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయంతో ఈ భారం రూ.800కి దిగజారడం రాష్ట్రానికి కలిసి వచ్చిందన్నారు.

తరుగు నివారణ

రైతుల నుంచి వరి కొనుగోలు నిబంధనలను సరళీకరించినట్లు మంత్రి తెలిపారు. వరి కొనుగోలు పురస్కరించుకుని తరుగు తొలగింపు లేకుండా యథాతథంగా రైతులు పోగు చేసిన ధాన్యం కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన 48 గంటల స్వల్ప వ్యవధిలో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని మంత్రి కృష్ణ చంద్ర పాత్రో తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆ శాఖకు వెళ్లి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి వ్యక్తికి ఆహార భద్రత కల్పించాలని, నిత్యావసర వస్తువుల మార్కెట్ ధరలను నిర్ణీత వ్యవధిలో నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

డింబిరిగుడ పాఠశాలలో చోరీ



డింబిరిగుడ పాఠశాల

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పూజారిగుడ పంచాయతీ పరిధి డింబిరిగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు కల్యాణ సింగుపూర్ పోలీసుస్టేషన్‌లో హెచ్‌ఎం ఉత్తమ్ పాత్రో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పాఠశాల కార్యాలయం తలుపులు విరగ్గొట్టిన దుండగులు విలువైన పత్రాలు, మరికొన్ని వస్తువులు చోరీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిరోజూ ప్రజా ఫిర్యాదుల పరిశీలన

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రతిరోజూ 2 గంటల పాటు ప్రజా సమస్యలను విననున్నారు. ఈ కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ప్రజల సమస్యలను క్రమశిక్షణతో పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా చొరవ కల్పించుకోవడం విశేషం. స్థానిక రాష్ట్ర అతిథి గృహ కార్యాలయంలో నిత్యం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజల విన్నపాలను, సమస్యలను, ఫిర్యాదు లేఖలు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజల ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందడం గమనార్హం. పలుమార్లు నేరుగా ప్రజలతో మమేకమై వారితో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నిత్యం ప్రజాభియోగాల కార్యక్రమం చేపట్టడం హర్షణీయం.

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.సీతారాం శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ నేతృత్వంలో జస్టిస్‌కు గోత్ర నామాలతో పూజలు చేయించారు. ఆయనతో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, డీఎల్‌ఎస్‌ఏ కోర్టు న్యాయమూర్తి సన్యాసినాయుడు, ఆలయ సిబ్బంది బీఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

ముగిసిన పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు



పార్వతీ పరమేశ్వరులకు చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని చక్రతీర్థ స్నానాలు పుణ్య వంశధార నదిలో ఘనంగా శుక్రవారం జరిగాయి. గణపతి పూజతో ప్రారంభమై పార్వతీ పరమేశ్వరులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం వంశధార నదిలో స్వామివారి సహిత వారాహి అమ్మవారికి పుణ్య చక్రతీర్థ సాన్నాలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో యథాస్థానంలో ఉంచి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో అర్చకులు శేషాచలం, అప్పారావు, ధనాలస్వామి, శివాజీ భక్తులు పాల్గొన్నారు.

'కేసులు త్వరగా పరిష్కరిద్దాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో 'మధ్యవర్తిత్వంతో ప్రజలకు జరిగే మేలు' తదితర అంశాలపై చర్చించారు. గత మూడు రోజులుగా న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ అందజేస్తున్నారు. శుక్రవారం ఈ శిక్షణలు బార్ కార్యాలయంలో నిర్వహించారు. బార్ అధ్యక్షుడు ఈశ్వరరావు, ఇతర సభ్యులు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఈ శిక్షణను ప్రారంభించారు. సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వం, సంధి ప్రాజెక్ట్ కమిటీ శిక్షకులు మధ్యవర్తిత్వ భావన-సాంకేతికతలపై ప్రసంగించారు. పలువురు న్యాయవాదుల వారి సందేహాలను, అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల నివేదికకు కసరత్తు

పొందూరు: జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల వివరాల కోసం ప్రభుత్వం కోరిన పూర్తిస్థాయి నివేదికలు తయారు చేసేందుకు కసరత్తు ప్రారంభించామని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం పొందూరు ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యాకిట్ల స్టాల్‌ను ఆయన పరిశీలించారు. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఖాళీల సంఖ్య నిర్ధారిస్తామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు యూడైస్ కోడ్ ప్రక్రియ కొనసాగుతోందని, తక్షణమే పూర్తిచేయాలని ఎంఈఓలను ఆదేశించారు. ఆయనతో పాటు ఎంఈఓలు పీవీ రామరాజు, పి.రాజారావు ఉన్నారు.

నేడు శ్రీజగన్నాథుని స్నానయాత్ర

- భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు
- 68 ప్లాటూన్ల పోలీసుల మోహరింపు



స్నానయాత్ర భద్రత సిబ్బంది శిక్షణ శిబిరం

భువనేశ్వర్:

పూరీ శ్రీజగన్నాథ స్వామివారి స్నానయాత్ర శనివారం జరగనుంది. రథయాత్ర తొలి ఘట్టంగా పరిగణించే ఈ యాత్రకు భక్తులు, యాత్రికులు తండోపతండాలుగా తరలి వస్తారు. శ్రీమందిరం రత్న వేదిక నుంచి స్నానోత్సవానికి మూల విరాటులు బహిరంగ స్నాన మండపానికి తరలి రావడం ప్రత్యేక ఆకర్షణ. భక్తుల సమక్షంలో స్వామివారి జలాభిషేకం నిర్వహించడం విశేషం. శ్రీజగన్నాథునితో ఆయన సోదరుడు బలభద్రుడు, సోదరి దేవీ సుభద్ర, సుదర్శనుడు స్నాన మండపానికి వేంచేసి యాత్రలో పాల్గొనడం ప్రత్యక్షంగా కనులారా తిలకించే అపురూప దృశ్యం వార్షిక స్నానోత్సవం. ఏటా జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని ఈ యాత్ర నిర్వహించడం ఆలయ ఆచారంలో భాగం. ఈ సందర్భంగా భక్తులకు సులభ దర్శన సౌకర్యంతో పటిష్టమైన శాంతిభద్రతలు కల్పించేందుకు అనుబంధ యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది.

స్నానయాత్ర వేళల వివరాలు

స్వామివారి వార్షిక స్నానోత్సవం సకాలంలో నిర్వహించేందుకు దేవస్థానం అధికార వర్గాలు ముందస్తు సన్నాహాలతో సిద్ధమయ్యారు. నిర్ధారిత వేళల ప్రకారం ఉత్సవ క్రతువుల్ని పూర్తి చేసేందుకు సేవాయత్ వర్గం పాలక వర్గానికి హామీ ఇచ్చింది. శనివారం ఉదయం 4 గంటల నుంచి 6 గంటల మధ్యత మూల విరాటుల తరలింపు (పొహండి బీజే) నిర్వహిస్తారు. ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల మధ్య జలసేవ, పూజ, స్నాన ఆచార వ్యవహారాలకు సమయం ఖరారు చేశారు. మధ్యాహ్నం 2.40 గంటలకు గజానన అలంకరణ (హతీ బెషా) ప్రారంభిస్తారు. భక్తులు సాయంత్రం 6.30నుంచి రాత్రి 9.30గంటల వరకు మూల విరాటులను గజానన అలంకరణలో స్నాన మండపంపై సర్వదర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

పటిష్ట ఏర్పాట్లు

భక్తులు, యాత్రికుల భారీ రద్దీ దృష్టిలో ఉంచుకుని సింహద్వారం గుండా ఆలయ ప్రవేశానికి అనుమతిస్తారు. మిగిలిన మూడు ద్వారా గుండా బయటకు వెళ్లడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. బొడొ దండొ మరియు వివిధ మార్గాల నుంచి వచ్చే భక్తులు మార్కెట్ ఛక్ నుంచి బారికేడ్‌లోకి ప్రవేశించవచ్చు. వారు ఆలయంలోకి ప్రవేశించే ముందు జోలో మండపం వద్ద మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీ చేసి అనుమతిస్తారు. శ్రీమందిరం ఉత్తర ద్వారం గుండా బయటకు వచ్చే వారు తమకు వీలైన రీతిలో బొడొ దండొకు వెళ్లేందుకు సౌకర్యం కల్పించారు.

ఆర్జిత దర్శనం

స్నానోత్సవం పురస్కరించుకుని పరిమిత ఆర్జిత దర్శనం సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఈ టికెట్ కలిగిన భక్తులకు పొహండి బిజే వేడుకని చేరువ నుంచి కనులారా తిలకించే అవకాశం లభిస్తుంది. ఈ వర్గం భక్తులు శ్రీమందిరం దక్షిణ ద్వారం ఆవరణ నుంచి బారులుతీరి మూల విరాటుల తరలింపుని కనులారా తిలకించగలుగుతారు. అనంతరం దక్షిణ ద్వారం తలుపులు మూసి వేస్తారు. స్నాన యాత్ర పురస్కరించుకుని మూల విరాటులకు సుభాషిత జలంతో అభిషేకిస్తారు. సమగ్రంగా 108 కలశాల సుగంధ జలంతో మూల విరాటుల్ని అభిషేకిస్తారు.

పోలీసుల మోహరింపు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అవాంఛనీయ సంఘటనల నివారణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా తెలిపారు. స్నాన యాత్ర సందర్భంగా పట్టణంలో 4 మంది ఎస్పీ హోదా అధికారులు, 12 మంది అదనపు ఎస్పీ హోదా అధికారులు, 22 మంది డీఎస్పీల ఆధ్వర్యంలో మొత్తం 68 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరిస్తారు. ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు దాదాపు 60 మంది ఇన్‌స్పెక్టర్లు, 290 మందికి పైగా సబ్ ఇన్‌స్పెక్టర్లుని నియమించనున్నట్లు ఆయన తెలిపారు.

మూల విరాటుల తాకిడి నివారణ

స్నానయాత్ర కోసం రత్న వేదిక నుంచి మూల విరాటులను స్నాన వేదికకు తరలించడం ఆచారం. ఈ ఆచార వ్యవహారం పురస్కరించుకుని తరలి వచ్చే మూల విరాటులను పరిమిత ఆర్జతి సేవా టికెటు కలిగిన భక్తులకు దక్షిణ ద్వారం నుండి దర్శన సౌకర్యం కల్పిస్తారు. అయితే ఈ సందర్భంగా మూల విరాటులను ఎవరూ తాకడానికి అనుమతించరని ఎస్పీ తెలిపారు.

హాకీ ఇండియా స్పాన్సర్‌షిప్ పొడిగింపు



హాకీ ఇండియా ప్రముఖులతో సమావేశం నిర్వహిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

- 2036 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం

భువనేశ్వర్: 2018 నుంచి భారత హాకీ జట్టుకు స్పాన్సర్ చేస్తున్న ఒడిశా ప్రభుత్వం హాకీ ఇండియాతో స్పాన్సర్‌షిప్ ఒప్పందాన్ని 2036 వరకు పొడిగించింది. గతేడాది మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పునరుద్ధరించిన స్పాన్సర్‌షిప్ ఒప్పందాన్ని 2033 వరకు అమలు చేయాల్సి ఉంది. తాజాగా కొత్త ప్రభుత్వం దానిని మరో 3 ఏళ్లపాటు పొడిగించింది.

భారత హాకీకి నిలయం ఒడిశా

2018 (భువనేశ్వర్) మరియు 2023 (భువనేశ్వర్ మరియు రౌర్కెలా)లో వరుసగా 2 పురుషుల ప్రపంచ కప్ పోటీలకు ఆతిథ్యమిచ్చిన ఒడిశా, గత దశాబ్దంలో భారత హాకీకి నిలయంగా మారింది. ఈ సంవత్సరం ప్రారంభంలో హెచ్‌ఐఎ ప్రో లీగ్ యొక్క ఇండియా లీగ్‌ను కూడా రాష్ట్రం నిర్వహించింది. ఒడిశా 2018 నుంచి పురుషులు, మహిళల జాతీయ హాకీ జట్లకు అధికారిక స్పాన్సర్‌గా కొనసాగుతోంది. గతేడాది ఏప్రిల్ నెలలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని అప్పటి ఒడిశా ప్రభుత్వం 2023 నుంచి 2033 వరకు రూ.434.12 కోట్లకు స్పాన్సర్‌షిప్‌ను పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. కాగా ప్రస్తుత ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, క్రీడా మంత్రి సూరజ్ సూర్యవంశీ, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ, సెక్రటరీ జనరల్ భోలా నాథ్ సింగ్ మరియు ఇతరుల సమక్షంలో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో స్పాన్సర్‌షిప్ ఒప్పందాన్ని పొడిగించాలని నిర్ణయం తీసుకున్నారు.

100 ఏళ్లను పురస్కరించుకొని...

రాష్ట్ర అవతరణ జరిగి 2036 నాటికి 100 ఏళ్లు పూర్తవ్వనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తెలిపారు. ఆ ఏడాది గుజరాత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం కూడా ఉంది. హాకీ ఎదుగుదలలో ఒడిశా పాత్ర కీలకంగా మారిందని, ఈ స్పాన్సర్‌షిప్ పొడిగింపు క్రీడల రంగంలో రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌గా మారుతుందని సీఎం అన్నారు. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రితో ఫలప్రదమైన సమావేశం నిర్వహించామన్నారు. క్రీడల పురోగతి, హాకీ క్రీడను కొత్త శిఖరాలకు చేర్చడానికి వ్యూహాల గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. భారత హాకీపై ఒడిశా చూపిన నిబద్ధతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ భాగస్వామ్యం క్రీడను వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. అలాగే ఒడిశా ప్రభుత్వం హాకీ క్రీడకు స్థిరంగా బలమైన మూలస్తంభంగా నిలిచిందని సెక్రటరీ జనరల్ భోలా నాథ్ హర్షం వ్యక్తం చేశారు. మా భాగస్వామ్యాన్ని 2036 వరకు పొడిగించాలనే వారి నిర్ణయం క్రీడలు మరియు యువత అభివృద్ధికి వారి అంకితభావాన్ని నొక్కి చెబుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

ఒలింపియాడ్‌లో బోరుభద్ర విద్యార్థుల ప్రతిభ

సంతబొమ్మాళి: జాతీయ స్థాయి ప్రతిభా పరీక్ష సెమ్స్ ఒలింపియాడ్‌లో బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన పట్నాన మృదుల రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించిందని పేర్కొన్నారు. అలాగే పాఠశాలకి చెందిన పొట్నూరు హరేంద్ర జోనల్ స్థాయిలో 5వ ర్యాంకు, జవ్వాది జాహ్నవి 9వ ర్యాంకు, సార ఇందు 16వ ర్యాంకు, మార్పు కీర్తిక 17వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు బహూకరిస్తారని సెమ్స్ ఒలింపియాడ్ సంస్థ నుంచి వర్తమానం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, ఎ.వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, బాడాన రాజు, డి.ఉషాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి, బి.నాగమణి, కె.విటిరెడ్డి, జి.జగదాంబ, బి.రజిని, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, ఎ.శంకరరావు, బి.కమలకుమారి, గోపాలరెడ్డి, సుశీలదేవి, కృ సాయిశివాని, త్రివేణి అభినందించారు.



విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బదరీనాథ్‌లో నడగాం వాసి మృతి

నరసన్నపేట: మండలం నడగాంకు చెందిన విశ్రాంత పంచాయతీ కార్యదర్శి దొంపాక సుధాకరరావు (68) బదరీనాథ్‌లో అస్వస్థతకు గురై మృతి చెందారు. వారం కిందట ఆయన తన భార్య అప్పలనర్సమ్మ కలసి తీర్థయాత్రలకు ప్రైవేటు ట్రావెల్ బస్సులో వెళ్లారు. బదరీనాథ్‌లో దర్శనం చేసుకుని ఆలయం నుంచి బయటకు వస్తున్న క్రమంలో గుండెపోటు వచ్చి ఆలయ ప్రాంగణంలోనే శుక్రవారం మృతి చెందారు. కళ్ల ముందే విషాదం జరగడంతో భార్య అప్పలనర్సమ్మ తట్టుకోలేకపోయారు. సమాచారం గ్రామానికి చేరడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుమారుడు పవన్ కుమార్ తెలిపారు. ఆయన మృతికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఉకలాపు రవి, త్రినాధరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రెండు బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

నందిగాం: మండలంలోని పెంటూరు గ్రామ సమీప రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వజ్రపుకొత్తూరు మండలం గూనాలపాడు(ఉప్పరపేట) గ్రామానికి చెందిన చెన్నంశెట్టి పాపారావు తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై పూండి నుంచి నందిగాం వైపు వస్తున్నారు. అలాగే పెంటూరు గ్రామానికి చెందిన సనపల నాగభూషణం తన భార్య లలితమ్మతో కలసి రెయ్యిబోడమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ కార్యాక్రమానికి వెళ్తున్నారు. ఈ రెండు వాహనాలు పెంటూరు సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ప్రమాదంలో పాపారావు ఎడమ కాలు విరిగిపోయింది. అలానే నాగభూషణం దంపతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పాపారావు కుమారుడు ధర్మారావు ఫిర్యాదు మేరకు నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

ఇచ్ఛాపురం రూరల్: ఎదురుగా వస్తున్న మేకల్ని తప్పించుకునే క్రమంలో స్కూటీతో కింద పడిన యువకుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం కంద్రవీధికి చెందిన కమల్ బెహరా అనే యువకుడు శుక్రవారం తన స్కూటీపై ఈదుపురం వైపు వస్తుండగా, అదే దారిలో వంతెనపై ఎదురుగా మేకలు వస్తుండటంతో వాటిని తప్పించే ప్రయత్నంలో మేకను ఢీకొట్టాడు. అయితే మేక తప్పించుకోవడంతో కమల్ బెహరా తన స్కూటీతో కింద పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అటువైపుగా వస్తున్న వాహనదారులు వెంటనే ప్రథమ చికిత్స అందించి అటువైపుగా వస్తున్న అతని స్నేహితులకు అప్పగించి, ఇచ్ఛాపురం ఆస్పత్రికి తరలించారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

ఎచ్చెర్ల: లావేరు మండలం లోపెంట గ్రామానికి చెందిన భార్యాభర్తలు అలుపాన అప్పలనాయుడు, అప్పయ్యమ్మలపై గత నెల 22వ తేదీన దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన తాత, బంగారి, లక్ష్మీనారాయణలను లావేరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అలుపాన అప్పలనాయుడు, అప్పయ్యమ్మల పెద్ద కోడలైన రూపమ్మ తన పిల్లలను కొడుతుండగా రూపమ్మను అత్తమామలు మందలించారు. ఈ విషయం తెలుసుకున్న రూపమ్మ తండ్రి తాత, అన్నదమ్ములు బంగారి, లక్ష్మీనారాయణలు అప్పలనాయుడు, అప్పయ్యమ్మ దంపతులపై దాడికి పాల్పడ్డారు. దీంతో గాయాలపాలైన వీరు లావేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ స్వామినాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారాబట్టీలపై పోలీసుల సంయుక్త దాడులు

మెళియాపుట్టి: మండలంలోని సవర ముకుందాపురం గిరిజన గ్రామంలో టెక్కలి, పలాస టాస్క్‌ఫోర్స్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సంయుక్తంగా సారా తయారీ స్థావరాలపై శుక్రవారం దాడులు చేశాయి. ఈ దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేయగా.. 45 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇటీవల అత్యధికంగా ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లోని గిరిజన గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటుసారా తయారీని నిలువరించేందుకు కృషి చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను తెలియపరచి, సారా తయారీ, క్రయ విక్రయాలు మానుకోవాలని సూచనలు చేశారు. టెక్కలి సీఐ రాజశేఖర్ నాయుడు, ఎస్సై గణేష్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



సవర ముకుందాపురంలో స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసు బలగాలు



ఉత్సవ మూర్తులను నదిలో స్నానానికి తీసుకెళ్తున్న దృశ్యం

వైభవంగా త్రిశూల స్నానాలు



త్రిశూల స్నానాలు చేయిస్తున్న అర్చకులు



ఉమారుద్రునికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉమారుద్రకోటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా శుక్రవారం త్రిశూల స్నానాలతో కల్యాణ వేడుకలు ముగిశాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి మేళతాళాలతో, వేదమంత్రాల నడుమ ఊరేగింపుగా నాగావళి నదికి తీసుకెళ్లి, అక్కడ శాస్త్రోక్తంగా పూజలు చేసి త్రిశూల స్నానాలు చేయించారు. ప్రముఖ వేద పండితులు ఆరవెల్లి హరగోపాల శర్మ పర్యవేక్షణలో ఈ ఉత్సవం జరిగింది. అనంతరం మూలవిరాట్ ఉమారుద్రకోటేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు.

మేఘ గర్జన.. అవగాహనే రక్షణ

- గురువారం బూర్జలో వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు ఇద్దరు మృతి
- మూడేళ్లలో 38 మంది బలి
- వాతావరణ మార్పులే ప్రధాన కారణం
- అవగాహన కలిగి ఉండాలంటున్న నిపుణులు



పిడుగుపాటుకు అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఇటుక బట్టీ కార్మికులు(ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్:

- సెల్‌ఫోన్ సిగ్నల్ రావడం లేదని డొంకూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు బుడ్డ కాంతారావు తన ఇంటి మేడ పైకి ఎక్కి మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.
- జగన్నాథపురం గ్రామానికి చెందిన జయ తోటి స్నేహితులతో కలసి వస్తుండగా, దారిలో వర్షం పడటంతో చెట్టు కింద నిల్చున్నారు. ఇంతలో ఆమెపై పిడుగుపడి మృతి చెందారు.
- వర్షం కురుస్తుండటంతో ఉపాధి పనులు అర్ధంతరంగా నిలిపి వేయడంతో పరుగు పరుగున ఇంటికి వస్తున్న క్రమంలో.. ఈదుపురం వంతెన వద్ద నీలాపు ఈశ్వరి అనే ఉపాధి కూలీపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు.
- గురువారం బూర్జ మండలం అయ్యవారిపేటకు చెందిన చోదవరపు వెంకటసత్యనారాయణ అనే యువకుడు పొలాల్లో ఆవులు మేపుతుండగా, వర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లి పిడుగుపాటుకు గురై మృతి చెందగా, అదే మండలం తమ్మినాయుడు పంచాయతీ కటకమయ్యపేటలో దేవరపల్లి బారికయ్య అనే వ్యక్తి పొలం పనులు చేస్తుండగా ఆయనపై పిడుగు పడి మృతి చెందాడు.

ఒకరు కాదు ఇద్దరు కాదు మూడేళ్లలో 38 మంది ఈ పిడుగుపాట్లకు బలైపోయారు. ఏటా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పిడుగుపాట్లు అధికమవుతున్నాయి. వర్షాకాలంలో వ్యవసాయ, ఉపాధి పనుల్లో నిమగ్నమయ్యే రైతులు, కూలీలు, పశువుల కాపరులు, రోడ్లపై వెళ్లే వాహనదారులు అధికంగా పిడుగుపాటుకు గురవుతున్నారు. అవగాహన కలిగి ఉంటే పిగుడుపాటు నుంచి రక్షించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

కాపర్ ఎర్తింగ్..

పిడుగుపాటు నుంచి తప్పించుకునేందుకు కాపర్ ఎర్త(రాగి తీగ)ను ఏర్పాటు చేసుకోవాలి. దీన్ని భవనం పైనుంచి భూమి లోపలి వరకు ఏర్పాటు చేయాలి. కిలోమీటరు దూరంలో పిడుగుపడినా భూమి ఆకర్షిస్తుంది. రాగితీగను ఏర్పాటు చేసుకునే సమయంలో ఉప్పుతో పాటు బొగ్గు కలిపి అందులో వేయాలి. శక్తివంతమైన విద్యుత్ ప్రవాహం పిడుగు రూపంలో కిందకి వచ్చినప్పుడు కాపర్(రాగి) తీగ ఆపే అవకాశం ఉంది. టవర్లు, సినిమా హాళ్ల వద్ద ఇలాంటివి ఏర్పాటు చేస్తారు. భవనాలు, పరిశ్రమలు అంతస్తులపై రాగి కడ్డీలను ఏర్పాటు చేసుకోవాలి.



మెరుపు

జాగ్రత్తలు పాటించాలి

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కిందకు వెళ్లకూడదు. విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండరాదు. చెట్లు, స్తంభాలకు దూరంగా ఉండాలి.
- ఇంట్లో ఉన్న స్విచ్‌బోర్డుల నుంచి ప్లగ్గులు తొలగించాలి. టీవీలకు ఉన్న కేబుల్ తీగలు తొలగించాలి. అలాగే ఉంచితే ఎలక్ట్రికల్ వస్తు సామగ్రి దెబ్బతినే ప్రమాదం ఉంది.
- ఉరుములతో కూడిన వర్షం పడుతుంటే కిటికీలు, తలుపుల వద్ద ఉండి బయటకు చూడవద్దు. కిటికీ తలుపులు మూసివేయాలి.
- ఎత్తైన ప్రదేశంలో నించుని ఫోన్ మాట్లాడకూడదు. ఎడ్ల బండ్లు, ద్విచక్రవాహనాలు నడపవద్దు.
- అధిక నీరు ఉన్న చోట ఉండటం గానీ, నీళ్లలో ఈత కొట్టడం గానీ చేయకూడదు.

ఆరుబయటే ఉంటే

- వర్షం కురిసే సమయంలో పొలాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పిడుగు పడే సమయంలో బయట ఉంటే అరచేతులతో చెవులు మూసుకొని, నేలపై మోకాళ్ల మీద కూర్చొని తల కిందకు వంచాలి.
- వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకు దూరంగా ఉండాలి.
- ఈదురు గాలులు, వర్షం పడే సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు కింద ఉండరాదు.
- చేతిలో సెల్ ఫోన్ ఉంటే స్విచ్ఛాఫ్ చేయాలి.
- గుండె జబ్బులు ఉన్న వారు వర్షం, ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

పిడుగు పాటుకు గురైతే..



పిడుగుపాటుకు గురైన వారు ప్రాణాపాయం నుంచి బయటపడటం అరుదు. అస్వస్థతకు గురైన వారిని వెంటనే వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి. పిడుగు పడిన ప్రదేశం తడిగా ఉంటే బాధితులను దుప్పటిపై పడుకోబెట్టాలి. ఊపిరి ఆగిపోతే కృత్రిమ శ్వాస అందించాలి. గుండె కొట్టుకోవడంలో తేడాలు గమనిస్తే ఆస్పత్రికి తీసుకువెళ్లే వరకు రెండు చేతులతో ఛాతీ పైభాగాన్ని గట్టిగా ఒత్తుతూ ఉండాలి.

– డాక్టర్ రేవతి భేరి,
ప్రభుత్వ వైద్యాధికారి, కొళిగాం

అప్రమత్తంగా ఉండాలి

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. చెట్ల కిందకు, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లరాదు. సెల్‌ఫోన్ వినియోగించకూడదు. పిడుగులు గుర్తించేందుకు ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. వజ్రపాత్ యాప్ ద్వారా పిడుగులు పడే అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగానే గుర్తించవచ్చు. ఇళ్లు, భవనాలపై లైటినింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకుంటే పిడుగుల ముప్పు తప్పించుకోవచ్చు.

– సాహుకారి కృష్ణమూర్తి,
రిటైర్డ్ సైన్స్ టీచర్, ఇచ్ఛాపురం

క్లుప్తంగా

బైక్‌ను ఢీ కొట్టిన ట్రాక్టర్ : వ్యక్తికి తీవ్రగాయాలు



రామభద్రపురం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న సత్యనారాయణ

రామభద్రపురం: మండల పరిధిలోని కొండకెంగువ గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదంపై స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన బండారు సత్యనారాయణ పనుల నిమిత్తం తన ద్విచక్రవాహనంపై మండలకేంద్రానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. గ్రామం సమీపంలోకి వచ్చేసరికి రహదారి పక్కన భూముల్లో దక్కిదున్నిన ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌ను రోడ్డు ఎక్కిస్తుండగా ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో సత్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. ప్రథమచికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

జాబ్ మేళాకు స్పందన



మాట్లాడుతున్న ట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారిణి అరుణ

విజయనగరం రూరల్: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక మహారాజా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 200 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. మూడు కార్పొరేట్ కంపెనీలు ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. జాబ్ మేళాకు హాజరైన జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారిణి డి.అరుణ వారికి పలు సూచనలు చేసి ఇంటర్వ్యూను ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పారు.

గానకోకిల పంపిన చీరతో పైడితల్లికి అలంకరణ



సుశీలమ్మ పంపించిన చీరను పైడితల్లి అమ్మవారికి అలంకరణ చేసిన అర్చకులు

విజయనగరం టౌన్: గానకోకిల, పద్మవిభూషణ్ డాక్టర్ పి.సుశీలమ్మ పంపించిన చీరను పైడితల్లి అమ్మవారికి శుక్రవారం అలంకరించినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి డీవీవీ.ప్రసాదరావు తెలిపారు. రెండువారాల క్రితం కొరియర్ ద్వారా పి.సుశీలమ్మ చీరలు పంపించారని, వాటిని ఆమె కోరిక మేరకు ఆయా తేదీల్లో అమ్మవారికి కడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

28న మెగా జాబ్ మేళా

పార్వతీపురంటౌన్: ఈ నెల 28న పార్వతీపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా 10వ తరగతి చదువుకుని వయస్సు 18 నిండి 35 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌కె సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ డ్రైవ్‌కి కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు వారి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెస్యూమె, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, 1 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు జరిగే డ్రైవ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8978878557, 7997299739 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న కౌన్సెలింగ్

విజయనగరం రూరల్: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లలో ప్రవేశాలకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌కు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, రాజాం ప్రభుత్వ ఐటీఐలు, 25 ప్రైవేటు ఐటీఐలలో వివిధ ట్రేడ్లలో ప్రవేశాలకు సుమారు 5 వేల సీట్ల భర్తీకి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్, విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి తెలిపారు. మూడోరోజు ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 111 మంది హాజరు కాగా 48 మందికి సీట్లు కేటాయించామన్నారు.

దిగుబడిలో దిట్ట..పచ్చిరొట్ట

- 50 శాతం రాయితీతో విత్తనాల పంపిణీ
- రసాయన ఎరువుల కొరత నివారణకు మార్గం
- దుక్కిలో కలియదున్నడం ద్వారా భూమి సారవంతం

రాజాం: భూమి కోల్పోయిన పోషకాలను సహజ పద్ధతిలో పునరుద్ధరించేందుకు ఉత్తమమైన మార్గం పచ్చిరొట్ట సాగు. నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట పంటలైన కట్టెజనుమ, జీలుగు, పిల్లి పెసర సాగుచేసి భూములను సారవంతంగా మార్చుకోవచ్చు. పూత దశలో ఉన్న పచ్చిరొట్ట పైర్లను పొలంలో కలియదున్నడం వల్ల అవి కుళ్లి నత్రజని తదితర పోషకాలు అత్యధిక పరిమాణంలో నేలకు అందిస్తాయి. పశువుల పేడకంటే పచ్చిరొట్ట పైర్లు పదిరెట్లు అధికంగా నేలను సారవంతం చేస్తాయి. తద్వారా కృత్రిమంగా నత్రజని, భాస్వరం వాడకం కూడా తగ్గించుకుని, నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చు. ఈ ఎరువుల ద్వారా పంటలో ఆశించిన మేర ఫలితాలు ఇస్తుండడంతో గ్రామాల్లో రైతులు ప్రధాన పంటల కంటే ముందు పచ్చిరొట్ట పంటల సాగు వైపు మొగ్గుచూపుతున్నారు.

ఇలా లాభం..

పచ్చిరొట్ట పైర్లు సాగుచేయడం ద్వారా నీటిని, పోషకాలను నిలుపుకునే సామర్థ్యం భూమికి పెరుగుతుంది. నేలలో కలియదున్నిన పంట కుళ్లిన తరువాత విడుదలచేసే భాస్వరం, పొటాష్‌తో పాటు గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరిస్తాయి. తద్వారా నేలసారం పెరుగుతుంది. సూక్ష్మపోషకాలు మొక్కలకు అందుతాయి. సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి మొక్కల వేర్లు అభివృద్ధి చెందుతాయి.

ఇలా చేయాలి..

పచ్చిరొట్ట ఎరువులను పూతదశలో నేలలో కలియ



మిర్తివలస సమీపంలో పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు

పంటపేరు- విత్తన మోతాదు ఎకరాకు(కేజీలో)	ఏదశలో దున్నాలి - దిగుబడి (టన్నుల్లో)
జనుము - 16-20	పూత దశలో - 5
జీలుగు - 12-16	పూతదశలో - 5
పిల్లిపెసర - 5-6	పూత దశలో - 4-5

దున్నాలి. ఆ సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్‌ఫాస్ఫేట్ వేస్తే పచ్చిరొట్ట త్వరగా కుళ్లతుంది. మగ్గిన తర్వాత పంటలో వేసుకోవాలి. పచ్చిరొట్ట సాగుచేసే పొలాల్లో నత్రజని ఎక్కువగా ఉంటే ఎకరాకు 8 కిలోల నత్రజని ఎరువులు వాడడం వల్ల మొక్కలు పెరిగి రొట్ట అధికంగా వస్తుంది. 50 శాతం రాయితీతో ఈ విత్తనాలు రైతులకు అందించారు. కట్టెజనుమ విత్తనాలు పది కిలోలు రూ.480 చొప్పులు రైతులకు ఆర్‌బీకేల ద్వారా అందించగా, ఇవి చాలా ప్రాంతాల్లో రైతులు వేసవిపంటగా వేసి, విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పుడు ఖరీఫ్‌కు వాటిని మళ్లీ సిద్ధం చేస్తున్నారు. 25 నుంచి 30 రోజుల వ్యవధిలో ఇవి పూతదశకు వస్తాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

పచ్చిరొట్టతో భూసారం



పచ్చిరొట్ట పంటల సాగుతో వ్యవసాయ భూమి సారవంతంగా తయారవుతుంది. భూసారం పెరగడానికి ప్రధాన పంటకు ముందుగా రైతులు విధిగా పచ్చిరొట్ట సాగుచేయాలి. పచ్చిరొట్ట ఎరువుతో దిగుబడి పెరగడంతో పాటు గింజగట్టిగా ఉంటుంది. ప్రతికూల పరిస్థితులను పైరు తట్టుకుని నిలబడుతుంది. ఆరోగ్యకర ఉత్పత్తులను సాధించవచ్చు. రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందించాం.

కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం

ఆలయ భూముల ఆక్రమణ చట్టరీత్యా నేరం



ఆక్రమణలకు గురైన స్థలాన్ని సర్వే చేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయ భూముల ఆక్రమణకు పాల్పడడం చట్టరీత్యానేరమని తహసీల్దార్ కె.జయ అన్నారు. ఈ నేపథ్యంలో తోటపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తలనీలాలు సమర్పించే భవనానికి ఎదురుగా ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమణకు పాల్పడుతున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డి.పారినాయుడు, ఎం.పకీరునాయుడు, ఎం.వాసునాయుడు, తదితరుల ఫిర్యాదు మేరకు శుక్రవారం తమ సిబ్బందితో వెళ్లి సర్వే చేశామన్నారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహించి ఆక్రమణలకు గురైన స్థలం దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్నట్లు నిర్ధారించామన్నారు. గతంలో ఆక్రమణదారులు వేసిన సిమెంట్ స్తంభాలను తొలగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎం.కృష్ణ, సర్వేయర్, బి.శ్రీనివాసరావు, వీఆర్‌ఓ రవికుమార్, స్థానిక ఎస్సై అమ్మాన్‌రావుతో పాటు దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ భూములే కాకుండా ఆలయ భూముల ఆక్రమణకు పాల్పడడం పట్ల స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో సహస్ర దీపారాధన కార్యక్రమం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు

జామి: మండలకేంద్రం జామి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం భోజనాలు వడ్డిస్తున్న సమయంలో అన్నంలో పురుగులు ఉండడాన్ని విద్యార్థులు గుర్తించారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు వచ్చి భోజనాన్ని పరిశీలించి అన్నంలో పురుగులు ఉన్నట్లు చూసి వెంటనే భోజనాలు నిలిపివేశారు. విద్యార్థులు ఆకలితో ఉండకుండా ప్రత్యామ్నాయంగా వెంటనే ఉప్మా చేయించారు. బియ్యం నిల్వ ఉండడంతో అన్నంలో పురుగులు వచ్చాయని, ఇక నుంచి ఇలా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హెచ్ఎం అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

అందుబాటు ధరల్లో కూరగాయలు



హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కె.కార్తీక్

- జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: మార్కెట్‌లో రోజురోజుకూ ధరలు పెరుగుతున్న కారణంగా రైతుబజార్లలో కూరగాయల ధరలను అందుబాటులో ఉంచడానికి కృషి చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. ఈ మేరకు హోల్‌సేల్ వర్తకులు, జిల్లా పౌరసరఫరాల అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ మార్కెటింగ్, రైతుబజార్ల ఎస్టేట్ అధికారులతో తన చాంబర్‌లో శుక్రవారం ఆయన సమీక్ష చేశారు. ప్రధానంగా టమాటో, బంగాళా దుంపలు, ఉల్లిపాయలను నిర్దేశించిన ధరల్లో రైతు బజార్లకు ఇవ్వడానికి హోల్‌సేల్ వర్తకులు అంగీకరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని మూడు రైతు బజార్లలో శుక్రవారం నుంచి అమ్మకాల ధరలను ప్రకటించారు. కిలో టమాటో రూ.60, కిలో బంగాళాదుంపలు రూ.30, కిలో ఉల్లిపాయలు రూ.35 ధరగా రైతుబజార్లలో అమ్మకాలు జరపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే ధ్యేయం

- రవాణాశాఖాధికారి శశికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి శశికుమార్

పార్వతీపురంటౌన్: రోడ్డు ప్రమాదాల నియంత్రణే ధ్యేయంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని పార్వతీపురం మన్యం జిల్లా రవాణాశాఖాధికారి శశికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల అవగాహన లోపం కారణంగా గిరిజన ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లకు పాలకొండ, సాలూరు, పార్వతీపురం ఎంవీఐ కార్యాలయాల్లో క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వాహనాల్లో ఓవర్‌లోడ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ధ్రువీకరణ పత్రాలు లేని, ఓవర్‌లోడ్ ఉన్న వాహనాలను గుర్తించి 45కేసులు నమోదు చేసి రూ.90వేలు అపరాధ రుసుం విధించామని చెప్పారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమావళిని పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు. లేని పక్షంలో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఏపీ హంస జిల్లా కార్యవర్గం

- అధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఎన్నిక



ఎన్నికైన హంస నూతన కార్యవర్గం

విజయనగరం ఫోర్ట్: ఏపీ హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు జోన్ -1 కో ఆర్డినేటర్ డి.సూరిబాబు ఎన్నికల అధికారిగా, డి.చిన్నబాబు సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఎస్.సూరిబాబు, జిల్లా కోశాధికారిగా ఎస్‌వీపీ సత్యనారాయణ, విజయనగరం పట్టణ అధ్యక్షుడిగా ఎస్.భీమేశ్వరావు, సిటీ కార్యదర్శిగా టి.వేణుగోపాల్, కోశాధికారిగా భావన, భోగాపురం తాలుకా అధ్యక్షురాలిగా కె.పద్మలత, కార్యదర్శిగా పి.సన్యాసమ్మ, కోశాధికారిగా ఎం.శ్రీనివాసరావు ఎన్నుకున్నారు.

కారు ఢీకొని బాలుడి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



బాలుడి మృతదేహం

గంట్యాడ: మండలకేంద్రంలోని పశువుల అస్పత్రి వద్ద బైక్, కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బాలుడి తల్లిదండ్రులు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డొంకాడ గ్రామానికి చెందిన శీరశ్రీను తన భార్య మౌనిక, మూడేళ్ల బాలుడు గణేష్‌తో కలిసి విజయనగరం నుంచి బైక్‌పై స్వగ్రామం డొంకాడ శుక్రవారం వస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో అరుకులోయ నుంచి గరివిడి వస్తున్న కారు గంట్యాడ పశువుల ఆస్పత్రి వద్ద ఢీకొనడంతో బైక్‌పై ఉన్న బాలుడు రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. శ్రీనివాస్ భార్య మౌనికకు కూడా గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం మేరకు సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై సురేంద్రనాయుడులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర నాయుడు తెలిపారు. ముక్కు పచ్చలారని బాలుడు మృతి చెందడంతో అప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్

చెరువులో పడి వ్యక్తి..

వంగర: మండల పరిధి అరసాడ గ్రామానికి చెందిన దమరసింగి మహేష్ (33) ప్రమాదవశాత్తు చెరువులో పడి శుక్రవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మహేష్ తన కుమార్తెతో పాటు మరో చిన్నారిని తీసుకుని గ్రామ సమీపంలో ఉన్న నారప్ప కోనేరుకు స్నానానికి వెళ్లాడు. మరో చిన్నారిని ఒడ్డున ఉంచి కుమార్తెతో పాటు చెరువులో స్నానానికి దిగాడు. ఇంతలో చెరువులోని గోతిలో దిగబడి పూర్తిగా మునిగిపోయాడు. అంతలో కుమార్తె గిలగిలా కొట్టుకోవడాన్ని గమనించిన ఒడ్డున ఉన్న మరోచిన్నారి రక్షించే ప్రయత్నం చేసింది. ఇద్దరు చిన్నారులు ప్రమాదంలో ఉన్నారని గమనించిన అటుగా వెళ్లిన స్థానికులు చూసి వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. మహేష్ కూడా చెరువులో మునిగిపోయాడని చిన్నారులు తెలపడంతో స్థానికులు ఆయనను బయటకు తీశారు. అప్పటికే కొన ఊపిరితో ఉండడంతో రాజాం సీహెచ్‌సీకి తరలించి చికిత్సనందించే ప్రయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందుతూ మృతిచెందాడని హెచ్‌సీ ఎస్.సుగుణాకరరావు తెలిపారు. మృతుని భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పని చేయించుకున్నారు.. పైసా ఇవ్వలేదు...

- ఆవేదనలో ఎన్నికల సిబ్బంది
- తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆవేదన

చీపురుపల్లి: ఒకటి కాదు రెండు కాదు ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఏకంగా రెండు నెలలు అంటే 60 రోజుల పాటు 24 గంటలూ పని చేయించుకున్నారు. ఏ పని చెప్పినా సమాధానం చెప్పకుండా చేశాం. ఎన్నికలు అయిపోయాయి.. ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది.. ఆ ప్రక్రియ మొత్తం ముగిసి రెండు వారాలు కావస్తున్నా కనీసం ఒక్క రూపాయి చెల్లించకుండా తమ శ్రమతో ఆటలాడుకుంటున్నారు. బిల్లులు పెట్టాం.. అదృష్టం ఉంటే కొత్తగా వచ్చే అధికారులు ఇస్తారంటూ అపహేళన చేస్తుండడం తీవ్ర మనస్తాపానికి గురి చేస్తోందంటూ ఎన్నికల సిబ్బంది వాపోతున్నారు. ప్రభుత్వ తీరుపై చీపురుపల్లి తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న వీఆర్వోలు, ఆర్ఐ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, వీఆర్వోలు శుక్రవారం నిరసన తెలిపారు. బీఎల్‌ఓలుగా విధులు నిర్వహించిన వీఆర్వోలు జేబులో డబ్బులు తీసి ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు రూ.8 వేలు చెల్లించగా, చీపురుపల్లిలో కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

ప్రభుత్వ ఐటీఐలో డ్రోన్ టెక్నాలజీ ట్రేడ్



మాట్లాడుతున్న విశాఖ రీజియన్ ఐటీఐ డీడీ రమణ

బొబ్బిలి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో త్వరలో కొత్తగా డ్రోన్ టెక్నాలజీ ట్రేడ్‌ను ప్రారంభించనున్నట్లు విశాఖ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీ రమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడి ప్రభుత్వ ఐటీఐ(స్త్రైవ్)లో రూ.1.2 కోట్లతో అధునాతనంగా తీర్చిదిద్దిన వీఆర్, ఏఆర్ ల్యాబ్‌లతో పాటు కొత్త కోర్సుల పుస్తకాలున్న లైబ్రరీ, డ్రైవింగ్, కంప్యూటర్ ల్యాబ్‌ను కళాశాల సిబ్బందితో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే రోటరీ క్లబ్ ప్రతినిధుల సౌజన్యంతో అధునాతన ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐటీఐ ట్రేడుల్లో కొత్తదనం, అధునాతన సాంకేతికత, మల్టీ స్కిల్స్‌ను పెంపొందించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో స్త్రైవ్ ప్రోగ్రాం ప్రారంభించినట్లు చెప్పారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులు పూర్తిస్థాయి సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఆన్‌లైన్ వీడియో క్లాసులను త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.దీనికోసం ఇన్‌స్ట్రక్టర్లకు స్కిల్ డెవలప్‌మెంట్‌ను మరింత అప్‌డేట్ చేసేందుకు భువనేశ్వర్‌లోని టూల్ రూమ్‌లో సెంట్రల్ ట్రెనింగ్ ఇచ్చే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

డీఎస్‌టీతో ఎంఓయూలు

ప్రభుత్వ ఐటీఐల్లో చదువు పూర్తి చేసిన విద్యార్థులకు పారిశ్రామికంగా శిక్షణ ఇచ్చేందుకు పరిశ్రమలతో ఎంఓయూలను కుదుర్చుకుంటామని డీడీ చెప్పారు. డీఎస్‌టీ (డ్యూయల్ సిస్టం ఆఫ్ ట్రెనింగ్) పేరుతో ఇచ్చే ఈ శిక్షణ వల్ల కంపెనీల్లో ఐటీఐ విద్యార్థులకు శిక్షణ పొందే ఉపాధి మార్గాలు లభిస్తాయన్నారు. దీనికి తోడు ఐటీఐల్లో బ్రిడ్జి కోర్సు తీసుకుంటునే నేరుగా డిప్లమో కోర్సు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. డ్రైవింగ్ శిక్షణ కోసం కొత్తగా వర్చువల్ విధానం తీసుకువచ్చామని, దీనిని 18 సంవత్సరాలు నిండిన వారెవరైనా పరిమిత ఫీజు చెల్లించి నేర్చుకోవచ్చని స్పష్టం చేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీ రమణ, రాజాం ప్రిన్సిపాల్ భాస్కరరావు, బొబ్బిలి ఐటీఐ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి.శేఖర్, టీఓలు, రోటరీ క్లబ్ ప్రతినిధులు టీఎస్ఎస్ కార్తీక్, గెంబలి శ్రీనివాసరావు, శ్రీహరి కార్యక్రమంలో పాల్గొన్నారు.



అధునాతన వీఆర్ డ్రైవింగ్ శిక్షణ పరికరంలో డీడీ ఆర్వీ రమణ తదితరులు

నిరంతర కృషితో కలల సాకారం

- డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు
- జీఎంఆర్ ఐటీలో గ్రాడ్యుయేషన్ డే

రాజాం సిటీ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కోరినట్లుగా విద్యార్థులు గొప్పగా ఆలోచనలు చేసి మంచి కలలు కనాలని, ఆ కలలు సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషిచేయాలని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జీఎంఆర్ ఐటీలో 9వ గ్రాడ్యుయేషన్ డే వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తును ఉన్నతంగా మలుచుకోవాలంటే కృషి పట్టుదలతో పాటు నిరంతర అన్వేషణ అవసరమన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమని చెప్పారు. సవాళ్లను స్వీకరిస్తూ మిగతా వారితో కలిసి పనిచేసి, నైపుణ్యాలను ఉన్నతంగా ఉపయోగిస్తూ సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని, ముఖ్యంగా విద్యారంగంలో ప్రతి రాష్ట్రంలో ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు ఉన్నాయన్నారు. ఏటా ఇంజినీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థుల్లో అధికశాతం మనదేశంలోనే ఉండి దేశాభివృద్ధికి కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. రీసెర్చ్ పత్రాల సమర్పణలో, పీహెచ్‌డీ డిగ్రీలు సాధించడంలో మన దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. అలాగే అంతరిక్ష రంగంలో పూర్తిస్వదేశీ పరిజ్ఞానంతో పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, క్రయోజనిక్ ఇంజిన్లు తక్కువ ఖర్చుతో తయారుచేసి వందలాది ఉపగ్రహాలను మనదేశంలోనే విజయవంతంగా ప్రయోగిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా రక్షణ రంగంలో స్వావలంబన సాధించామని అమెరికా, రష్యా, చైనా తర్వాత గొప్పశక్తిగా ఎదిగామని, తేలికపాటి యుద్ధ విమానాలు, ఐఎన్ఎస్ విక్రాంత నౌక తయారీ, పూర్తిస్థాయి స్వదేశీ తుపాకులు తయారుచేయగలిగామని చెప్పారు. ఐడెక్స్ ద్వారా రూ. 10 కోట్లు వరకు, డీఆర్‌డీఓ ద్వారా రూ. 50 కోట్లు విలువ చేసే ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి



విద్యార్థినికి అవార్డు అందిస్తున్న దృశ్యం

రాష్ట్రంలో తొలి ఐదు స్థానాల్లో జీఎంఆర్ ఐటీ

జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఎస్ఆర్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మొదటి 50, రాష్ట్రస్థాయిలో మొదటి ఐదు స్థానాల్లో జీఎంఆర్ ఐటీ ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ది ఇంపాక్ట్ ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించామని పేర్కొన్నారు. అనంతరం గ్రాడ్యుయేట్ విద్యార్థుల అత్యుత్తమ విజయాలను గుర్తిస్తూ అవార్డులు, బంగారు, వెండి పతకాలతో పాటు డిగ్రీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ఎల్ఎం లక్ష్మణమూర్తి, జీఎంఆర్‌వీఎఫ్ సీఈఓ అశ్వినిలోహని, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ డిప్యూటీ సీఈఓ అలెక్సిస్ తదితరులు పాల్గొన్నారు.